
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 30 | సంచిక : 9 | మే 2024


## ఈ సంచికలో. . . .



శంకరాచార్యుల వారి అవతార విశేషం ............ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 5

బుద్ధుడి నిరహంకార స్థితి ........................ 19

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

మనస్సు ఎలా చెపితే అలా ప్రవర్తించకూడదు. దేవుడు చెప్పిన వాక్యానికి అనుగుణంగా ప్రవర్తిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు, ధర్మాన్ని ఆచరించు, అదే నిన్ను రక్షిస్తుంది.


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)


పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# శంకరాచార్యుల వారి అవతార విశేషం

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**



కైలాసంలో ఉన్న శంకరుడే ఆచార్యుల వారిగా వచ్చాడని అంటారు. ఆచార్యులు వారు కాలడిలో జన్మించారు. ఆయన చిన్నప్పుడే తండ్రిగారు చనిపోయారు. నడక వచ్చేవరకూ ఇంటి వద్ద తల్లితో ఉండి. వేదపాఠశాలకి వెళ్తూ ఉండేవాడు, ఎనిమిదవ సంవత్సరంలో తల్లి దగ్గర సెలవు తీసుకొని ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. కాషాయ బట్టలు ధరించి, మధ్యప్రదేశ్‌లో తన గురువు గోవిందభగవత్పాదులు దగ్గరికి వెళ్ళాడు. గోవిందభగవత్పాదుల ఆదేశానుసారం కాశి వచ్చాడు. అక్కడ అద్వైతమతం స్థాపించ టం కోసం పండితుల తోటి వాద ప్రతివాదములు చేసాడు. తరువాత దేశ పర్యటన ప్రారంభించాడు. ఆయన కాలడిలో జన్మించాడు, కేదారులో అదృశ్యమయ్యాడు. ఆయన శరీరం శవం అవ్వలేదు, కేదారులో డిజప్పియర్ అయిపోయింది.

ఆయన కాలడి వచ్చినప్పుడు పార్వతి, కుమార స్వామి, విఘ్నేశ్వరుడు, ఆ కుటుంబ సభ్యులు ఎవరూ లేకుండా ఒక్కడే వచ్చేసాడు. రాముడు భూమి మీదకి వచ్చినప్పుడు లక్ష్మణుడిని సీతమ్మని తీసుకొచ్చాడు. ఆచార్యులు వారు ఒంటరిగా వచ్చారు. కృష్ణుడి లాగ రాముడి లాగ ఆయన యుద్ధాలు చేసి ధర్మ సంస్థాపనార్థం అవతరించలేదు. ఆయనకి రాక్షస సంహారం ఏమీ లేదు. బయట ఉన్న రాక్షసులని కాదు ఆయన చంపుతున్నది, లోపల ఉన్న అజ్ఞానం అనే రాక్షసుడిని చంపటానికి వచ్చాడు.

ఆయనకి అమృతానుభవం ఉంది, బోధ ఉంది. రెండూ ఒకచోట ఉండటం కష్టం. ఆచార్యులువారికి రెండూ ఉన్నాయి. ఒకటి అమృతానుభవం చేతిలో పెట్టుకున్నాడు. రెండు

టీచింగ్ – సరళమైన భాషలో, అందరికీ అందే భాషలో, సంస్కృతంలో భోధించారు. ఆయన ఆలోచిస్తే సంస్కృతంలో ఆలోచిస్తాడు, మాట్లాడితే సంస్కృతంలో మాట్లాడతాడు, రాస్తే సంస్కృతంలో రాస్తాడు.

ఈ ప్రపంచంలో సైన్సు టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, మెటాఫిజిక్స్ అభివృద్ధిలోకి వచ్చినా, 'బయట ఏమీ లేదు ఉన్నది ఒక్కటంటే ఒక్కటే' అనే మతం ఒక్కటే నిలబడుతుంది భవిష్యత్తులో. మిగతావి అన్నీ గాలిలో కొట్టుకుపోతాయి. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే! అయితే మనందరికీ నానాత్వం ఉంది. దేహాలు చూస్తున్నాం, మనస్సులు చూస్తున్నాం. మీ దేహాన్ని చూసి, నల్లగా ఉన్నారని ఎర్రగా ఉన్నారని ఇలా అనుకొంటున్నాము, మనస్సుని చూసి మీ గుణం ఇటువంటిది అంటున్నాము. రెండూ అబద్ధమే. లోపల పరమేశ్వరుడు ఉన్నాడు. వాడిలో నానాత్వం లేదు, భిన్నత్వం లేదు, ఏకత్వమే. ఆ ఏకత్వం చూసిన వాడు ధన్యుడు, వాడు ఋషి అవుతాడు. మనం ఏకత్వాన్ని చూడము, నానాత్వాన్ని భిన్నత్వాన్ని చూస్తాము. కాని మనం ఏకత్వాన్ని దర్శించాలి. ఆ ఏకత్వాన్ని దర్శింప చేయటానికి, అద్వైతానుభవం అమృతానుభవం కలగచేయటం కోసమే, ఆచార్యులువారు, భూమి మీదకి వచ్చి కాషాయ బట్టలు ధరించి భారతదేశమంతా పర్యటించి ప్రచారం చేసారు.

ఆచార్యులు వారికి తెల్లవారితే టీచింగు రైటింగు, రోజూ ఇదే పని ఆయనకి. ఆ టీచింగుకి స్టాప్ లేదు. టీచింగు రైటింగు – మన అజ్ఞానాన్ని పారద్రోలటం కోసం అవి రెండే వెపన్స్ (ఆయుధాలు) ఆయనకి. వాడు దుష్టుడు వాడిని సంహరిస్తాము అనే వారు కాదు ఆచార్యులు. ఆ దుష్టుడిని సత్పురుషుడిగా సహృదయంగా మార్చాలి, అది ఆచార్యులు వచ్చిన పని. దుర్మార్గులను సంహరించటానికి, రాక్షస సంహారానికి వచ్చిన అవతారాలు వేరు. ఇక్కడ కేవలం టీచింగే. అంటే ఆయన చెడ్డ వాళ్ళని చంపేయటం కాదు, చెడ్డ వాళ్ళని మంచివాళ్ల కింద మార్చాలి, సహృదయులుగా మార్చాలి. ఆ చెడ్డ సంస్కారాలు లాగేసి, మంచి సంస్కారాలు ఏర్పాటు చెయ్యాలి. దుష్ట వాసనలు తీసేసి, మంచి వాసనలు, చక్కటి సంస్కరింప బడినటువంటి వాసనలు ప్రవేశ పెట్టాలి. ప్రవేశపెట్టిన తరువాత, అప్పుడు వాళ్లకి ట్రూత్ కి మార్గం చూపించాలి. ముందు దుష్టవాసనలు తీసేయాలి. తీసేసి వాడిని మంచి గుణాలతోటి నింపాలి. సహృదయం తోటి సద్బుద్ధి తోటి నింపాలి. గుణసంపద తోటి నింపాలి. నింపిన తరువాత అప్పుడు వాడిని ట్రూత్‌కి తోలుకెళ్లేవాడు.

అది అంత తేలిక కాదు. మీకు సంపద ఉంటే, పది వంతెనలు కట్టండి. లేకపోతే

పది ఆశ్రమాలు కట్టండి, సత్తరువులు కట్టండి, ఇరవై కాలేజీలు ముప్పై హై స్కూళ్ళు కట్టండి. వీటన్నిటి కంటే ఒక సత్పురుషుడిని తయారు చేయటం కష్టం. ఒక సహృదయం ఉన్నవాడిని, సద్బుద్ధి ఉన్నవాడిని తయారు చేయటం కష్టం. ప్రపంచం చాలా అభివృద్ధి అయ్యింది పూర్వం కంటే అనుకొంటాము. కాని ఇంకొక గాంధీ, ఇంకొక ఐన్‌స్టీన్, ఇంకొక లింకన్ ఎక్కడ ఉన్నారు! అంటే, దీని లోతులు తెలియక, మనకి చిత్తశుద్ధి లేక అలా అనుకుంటాము. బయట డబ్బుంటే మేడలు కట్టవచ్చు. కాని సహృదయం సంపాదించటం కష్టం, సహృదయం రావటం అంటే, నీతోటి నువ్వు పోరాడటం. మారుమనస్సు పొందాలి. నీ స్వభావం నీకు సహృదయం రానివ్వదు. ఎన్నో జన్మల నుంచి వచ్చిన అలవాట్లు ఉంటాయి, చేసిన పొరపాట్లు ఉంటాయి. దాని తాలూకు వేగం వల్ల సహృదయం సంపాదించటానికి నీవు ప్రయత్నం చేసినా, మాటి మాటికీ ఫెయిల్ అవుతూ ఉంటాము. మన అలవాట్ల వేగం అటువంటిది. సహృదయం ఉన్నవాడిని, మంచి బుద్ధి ఉన్నవాడిని ఒక్కడిని తయారు చేయటం కష్టం. మీరు మీ అబ్బాయికి పదికోట్లు సంపాదించి ఇవ్వవచ్చు కాని, వాడిని బుద్ధిమంతుడిని చేయలేరు. మీరెప్పుడూ ప్రయత్నం చేయలేదు కాబట్టి దాని విలువ మీకు తెలియటం లేదు.

సన్నిహిత శిష్యులతో శంకరుడు ఏమన్నాడు అంటే మీకు నేను ఎంత చెప్పినా ప్రయోజనం లేదు, మీకు పూర్వపుణ్యం లేకపోతే పరిశుద్ధమైన హృదయం రాదు. మీకు పూర్వపుణ్యం లేదు అనుకోండి మీకు పరిశుద్ధమైన మానసం రాదు, మంచిబుద్ధి రాదు. మీ లోపల ఉన్న పాపం ఆ మాటని లోపలికి రానివ్వదు, దానిని బయటికి గెంటేస్తుంది.

ఆచార్యులు వారు చెప్పిన మాట ఒకటి మీకు చెపుతున్నాను, మీ అందరికీ ఉపయోగపడుతుంది అని చెపుతున్నారు శ్రీనాన్నగారు – 'నేను ఎంత రాసినా, ఎంత చెప్పినా, నీకు పుణ్యబలం లేకపోతే తెలియదు. అలాగని, మీకు పుణ్యబలం లేదని నేను చెప్పటం మానను. ఎందుచేత అంటే ఆ పని మీదే వచ్చాను కాబట్టి. ఇక్కడికి మీరు ఎవ్వరూ రాలేదు అనుకోండి, ఈ గోడలకి చెప్పుకొని వెళ్ళిపోతాను. మీరు వస్తే ఏముంది, రాకపోతే ఏముంది, ఒక్కడే కూర్చొని ఉన్నాడు అనుకోండి, వాడికి చెప్పి, వాళ్ళూ లేకపోతే గోడలకి చెప్పి వెళ్ళిపోతాను అన్నాడు. ఆయన ఆత్మబోధ చెప్పటమే కాదు, ఆయన చెప్పే మాట మనకి అర్థం అయ్యేలాగ అనుగ్రహిస్తాడు. వాడు ఆచార్యుడు అంటే! ది గ్రేట్ ఆచార్య!'

## ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 06 జనవరి 1996, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఓం స్కంధాయనమః ఓం స్కంధాయనమః ఓం స్కంధాయనమః. ఈ రోజున సుబ్రహ్మణ్య షష్ఠి. సుబ్రహ్మణ్యుడు, సు అంటే బాగుగా, బ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మ స్వరూపం తెలిసున్నవాడు బ్రహ్మణ్యుడు. సు బాగుగా, clarity, అస్పష్టంగా కాకుండా స్పష్టంగా తెలిసినవాడు, అందుచేత ఆయన సుబ్రహ్మణ్యుడు. గణపతిశాస్త్రి గారు ఏమన్నారు అంటే, దైవ దత్తమైన అధికారంతో, సాక్షాత్తూ సుబ్రహ్మణ్యుడే రమణమహర్షిగా అవతరించాడు అని చెప్పారు. ఒక భక్తుడు భగవాన్‌ని ఏమని అడిగారు అంటే మీరు సుబ్రహ్మణ్య స్వామి అవతారం అని గణపతిశాస్త్రి గారు చెబుతున్నారు. ఏమిటి అంటే, ఆయన నోరు ఎవరు కట్టగలరు? గుళ్ళో ఒక రాయిని పెట్టి ఇతను సుబ్రహ్మణ్య స్వామి అని అంటున్నారా, లేదా? పోనీ ఈ దేహాన్ని ఆయన అనుకోనివ్వండి. మనం ఆగమంటే ఆగుతాడా అన్నారు. వాడు రమణమహర్షి అంటే! మనతో ఎవరైనా మీరు దేవుడి అవతారం, మీరు రాముడి అవతారం, కృష్ణుడి అవతారం, సుబ్రహ్మణ్య స్వామి అవతారం అంటే మనం అందరం సంతోషిస్తాం. మీరు సాక్షాత్తూ విష్ణువే, విష్ణువు మీ రూపంలో వచ్చాడు అని మనతో ఎవరైనా చెబుతారు అనుకోండి, నిజం కాబోలు అనుకుంటాం, సంతోషిస్తాం. భగవాన్ అలా సంతోషించలేదు, గణపతిశాస్త్రి గారు public meetingలో మీరు సుబ్రహ్మణ్య స్వామి అవతారం అని చెపుతున్నారు అంటే, ఆయన సంతోషించలేదు సరికదా, గుళ్ళో ఒక రాయిని పెట్టి ఆ రాయిని సుబ్రహ్మణ్య స్వామి అని అంటున్నారా, లేదా? అలాగే ఈ దేహాన్ని కూడా ఆయన అనుకుంటే అనుకోనివ్వండి అన్నారు, అక్కడ ఉన్నారు భగవాన్.

తిరుత్తణి క్షేత్రం సుబ్రహ్మణ్య క్షేత్రం, గొప్ప క్షేత్రం. నేను ఆ క్షేత్రానికి ఒకసారి దర్శనానికి వెళ్ళాను అన్నారు నాన్నగారు. నేను సాయంత్రం 5 గంటలకు వెళ్లాను. నేను ఒక్కడినే వెళ్లాను, నా కూడా ఎవరు లేరు. సుబ్రహ్మణ్య స్వామి దర్శనం చేశాను. వట్టి చేతులతోటి వెళ్ళాను, ఒక పండు పట్టుకుని వెళ్ళలేదు, పూలు పట్టుకెళ్ళలేదు. అంటే సర్వసాధారణంగా ఏమని చెబుతారు అంటే శివుడు అభిషేక ప్రియుడు, విష్ణువు అలంకార

ప్రియుడు, కుమార స్వామి దర్శన ప్రియుడు అని చెప్తారు. ఊరికే వట్టి చేతుల తోటి వెళ్లాము సుబ్రహ్మణ్య స్వామి దగ్గరకి, సరే సాయంత్రం ఐదు గంటలకి వెళ్లాము. దర్శనం అయ్యిపోయింది. ఊరికే చూసి వచ్చాం. మరుసటి రోజున ఉదయం తిరువణ్ణామలై ప్రయాణం ఫస్ట్ బస్సుకి వెళదాం అని అనుకొని, ఆ దేవస్థానంలో ఒక రూమ్ తీసుకుని పడుకొన్నాము. ఆ రాత్రి స్వప్నంలో పెద్ద సర్పం వచ్చింది. అది ఎంత పెద్ద సర్పం అంటే, మొదలు కనిపిస్తుంది కానీ చివర కనపడడం లేదు. అంత పెద్ద సర్పం. అంత పెద్ద సర్పాన్ని చూస్తే జనరల్‌గా భయం వేస్తుంది. పాముని చూస్తే మనకి భయం వేస్తుంది కదా కానీ నాకు భయం వేయటం లేదు. ఆ పాము బుసలు కొట్టటం లేదు. మనుషుల్లో సత్వగుణం ఉన్నవాళ్ళు ఎలా ఉంటారో, ఆ పాము కూడా సత్వగుణంగా ఉంది. కోపం తెచ్చుకోవటం లేదు. నోరు కనిపిస్తుంది కానీ తోక కనిపించటం లేదు. అంత పొడుగు పాము లావుగా ఉంది, చాలా పెద్ద పాము. ఆ పాము ఏమి చేసింది అంటే నెమ్మదిగా నోరు విప్పి పొద్దున్న ఫస్ట్ బస్సుకి నువ్వు ప్రయాణం పెట్టుకున్నావు, నాకు పూలు ఇవ్వకుండా, పళ్ళు ఇవ్వకుండా ఏమీ ఇవ్వకుండా నువ్వు వెళ్ళిపోతావా ఫస్ట్ బస్సుకి అని అడిగింది. ఇదేమిటి ఇలా అడుగుతున్నాడు ఏమిటి, మనకి ఇచ్చే ఉద్దేశ్యం ఏమీ లేదు, అడిగి పుచ్చుకునేలా ఉన్నాడు అని నేను ఫస్ట్ బస్సుకి ప్రయాణం cancel పెట్టేసుకుని, మరుసటి రోజు కాఫీ కూడా పుచ్చుకోవడం మానేసి, నిష్టగా మనం చెయ్యాలి అని, ఉదయం స్నానం చేసి, పుష్పాలు, పళ్ళు అన్నీ తీసుకుని శాస్త్రీయంగా అక్కడ బ్రాహ్మణుడిని పిలిచి పూలు, పళ్ళు స్వామికి అర్పించాం. ఇది అక్కడ నాకు జరిగిన అనుభవం.

సర్వసాధారణంగా మానవుడు అహంకార పూరితుడు. అహంకార పూరితంగా ఉన్నవాడికి అహంకారమే మెయిన్. వాడు ఏమి ఆలోచించినా అహంకారం కేంద్రంగా పెట్టుకుని ఆలోచిస్తాడు. వాడికి సత్యం అక్కర్లేదు, ఏమీ అక్కర్లేదు. ఏమి ఆలోచించినా అహంకారం కేంద్రంగా పెట్టుకుని ఆలోచించేవాడిని egoist అంటారు. వాడికి సమాజం ముఖ్యం కాదు, దేవుడు ముఖ్యం కాదు, సోషల్ వెల్ఫేర్ ముఖ్యం కాదు, ఏదీ ముఖ్యం కాదు. వాడి అహంకారమే వాడికి ముఖ్యం. మనకి ఏ ఆలోచన వచ్చినా, ఏ తలంపు వచ్చినా, ఏ ఊహ వచ్చినా body thought లోంచే వస్తుంది. దేహం నేను అనే తలంపు మనకి ఉంది. ఆ

తలంపు లోంచి ఏ తలంపు అయినా వస్తుంది, ఇక్కడ కూర్చుని ప్రాక్టికల్‌గా, మీకు ఏ తలంపు వచ్చినా సరే దానిని చూడండి, అక్కడ మెయిన్ thought ఏమిటి అంటే బాడీ thought. మీకు మంచి తలంపులు రానివ్వండి, చెడు తలంపులు రానివ్వండి, ఏ తలంపు రానివ్వండి, అన్నీ దేహము నేను అనే తలంపులో నుండే వస్తాయి. కొంతమంది narrow mindedగా ఉంటారు. కొంతమంది ప్రతీ చిన్న విషయానికి కంగారు పడిపోతూ ఉంటారు. ఏ కారణం అయినా మీ feelingsకి, మీ worriesకి, మీ tensionsకి, మీ up and downsకి, దేనికైనా కారణం body thought. ఇందులోంచి tensions వస్తున్నాయి, ఇందులోంచి worries వస్తున్నాయి, ఇందులోంచి feelings వస్తున్నాయి, ఇందులోంచి ups వస్తున్నాయి, ఇందులోంచి downs వస్తున్నాయి. మీరు ఇవన్నీ ఎక్కడ నుంచి వస్తున్నాయి అని అనాలసిస్ చేసి చూస్తే, వెనక్కి వెళ్లి చూస్తే నాకు ఎందుకు ఈ తలంపు వస్తుంది? ఎందుకు ఈ feeling వస్తుంది? నాకు ఎందుకు ఈ టెన్షన్ వస్తుంది అని చూస్తే మొత్తం మీద దేహం నేను అనే బుద్ధి లోంచి ఇవన్నీ పుట్టి వస్తున్నాయి. బుద్ధి దేనికి పరిమితం అయ్యింది? మీ దేహానికే పరిమితం అయ్యింది. ఆ దేహం పుట్టినప్పుడు పుట్టాం అనుకుంటున్నాం. దేహం పెరిగినపుడు ముసలిది అయ్యింది అనుకుంటున్నాం. దేహం మరణించినప్పుడు మరణించింది అనుకుంటున్నాం. మన యొక్క existence, మన అస్తిత్వం దేనికి పరిమితం అయ్యింది? దేహానికే పరిమితం అయ్యింది. మనకొచ్చే ఆలోచనలు అన్నీ దేనికి పరిమితం అయ్యి వచ్చాయి? దేహానికే పరిమితం అయ్యి వస్తున్నాయి. గాఢనిద్ర లోంచి జాగ్రదావస్థలోకి రాగానే ముందు అందరికీ ఏమి తలంపు వస్తుంది? నేను వ్యవసాయదారుడిని, నేను డాక్టరుని, నేను జడ్జిని, నేను కలెక్టరుని అని వాడు అనుకోడు. ముందు నేను అనే తలంపు వస్తుంది. దేహగతమైన నేను ముందు వస్తుంది.

ప్రపంచంలో అత్యంత నీచమైనది, ఎందుకు పనికిరానిది, ఏమీ ఉపయోగ పడనిది, మనం ద్వేషించవలసినది, మనం పోగొట్టుకోవాల్సింది, ఈ దేహగతమైన నేను మాత్రమే. ఇది పోకుండా మీరు ఏ లోకానికి వెళ్ళినా మిమ్మల్ని మాములుగా కర్మ వెంటాడుతూ ఉంటుంది, జన్మ పరంపరలు వెంటాడుతూ ఉంటాయి. మనం ఇతరులని కాదు ద్వేషించవలసినది. మన దేహగతమైన నేనునే మనం ద్వేషించుకోవాలి. మన దేహగతమైన


నేనునే అసహ్యించుకోవాలి. ప్రపంచంలో ఎందుకు పనికిరానిది ఏమిటి అంటే అహంకారం. అది ఎందుకు పనికిరాదు. మనకీ పనికిరాదు, ఇతరులకీ పనికిరాదు. అన్నిటికంటే నీచమైనది, ఎందుకు పనికిరానిది అహంకారం. ఇంతకంటే పేడ మెరుగు. పేడ చేనులో వేసుకుంటే ఇంకో నాలుగు బస్తాలు ఎక్కువ పండవచ్చు. కానీ అన్నిటికంటే ఏది పనికిరానిది అంటే అహంకారం. దేహగతమైన నేనుని అహంకారం అని పిలుస్తారు. మనం ద్వేషించవలసినది కూడా ఆ దేహగతమైన నేనునే. అన్ని దుఃఖాలకి, అన్ని tensions కి, అన్ని బాధలకి, పునర్జన్మలకి, పూర్వజన్మలకి, ఈ అన్నిటికి దేహగతమైన నేనే కారణం. దేహం మరణించినప్పుడు కూడా దానికి చావు లేదు. అది అలాగే ఉంటుంది. అందుచేత మనం దానిని తొలగించుకోవాలి. కాని ఆ దేహగతమైన నేను ఎంతో మంచిది అని మనం అనుకుంటున్నాం. అది మంచిది అనుకుంటున్నాం కాబట్టి దానిని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యడం లేదు. అది ఎందుకు పనికిరాదు అన్న సంగతి ముందు మనకి అవగాహన అయితే దానిని remove చేసుకోవడానికి, దానిని తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తాము. అది చాలా మంచిది, మనకి ఉపయోగపడుతుంది అనుకున్నప్పుడు మనం ఎలా తొలగించుకుంటాం? తొలగించుకోలేము. మన జీవితానికి అది ఎందుకు పనికిరాదు. ఈ లోకానికి సంబంధించిన జీవితానికి కానీ, పరలోకానికి సంబంధించిన జీవితానికి కానీ, అది మనకు పనికిరాదు. పైగా మన హృదయంలో ఉన్న ఆనంద సముద్రం, ఆ శాంతి సముద్రం మనకి అందుబాటులోకి రాకుండా ego అడ్డు వస్తోంది అనే విషయం కూడా మనకి తెలియటం లేదు. దానిని తొలగించు కోవడానికి మనం ఎందుకు ప్రయత్నం చెయ్యడం లేదు అంటే అదే మనం అనుకుంటున్నాం.

మీకు ఎప్పుడైనా శాంతిగా ఉంది అనుకోండి, ఆనందంగా ఉంది అనుకోండి, సుఖంగా ఉంది అనుకోండి, సింహాసనం మీద కూర్చున్నట్టు ఉంది అనుకోండి మీకు, అలౌకికమైన సుఖం మీరు అనుభవిస్తున్నారు అనుకోండి, అలౌకికమైన శాంతి మీరు అనుభవిస్తున్నారు అనుకోండి, అది ఈ planet కి సంబంధించినది కాదు అనుకోండి అటువంటి అనిర్వచనీయమైనటువంటి ఆనందం, శాంతి మీకు అనుభవంలోకి వస్తే అది జ్ఞానఫలం. మీ జ్ఞానానికి ఫలంగా భగవంతుడు అనుగ్రహించాడు. Unlimited bliss, Unlimited

happiness. కొన్ని క్షణాలు మీ జీవితంలో కనుక అనుభవంలోకి వస్తే, బాహ్యా విషయాల మీద కానీ, బాహ్యా వస్తువుల మీద కానీ, బాహ్యా వ్యక్తుల మీద కానీ ఆధారపడి ఉండదు ఆ సుఖం. అది స్వతంత్రంగా ఉంటుంది. ఆ స్వతంత్రమైన సుఖం కనుక మీకు అనుభవంలోకి వస్తే అది దేనిఫలం? జ్ఞాన ఫలం. అంటే అగ్నిని విడిచిపెట్టి వేడి ఏ విధంగా అయితే వేరుగా ఉండదో, అలాగే జ్ఞానాన్ని విడిచిపెట్టి ఆనందం కూడా వేరుగా ఉండదు. మీకు ఎప్పుడైనా ఆనంద అనుభూతి కలిగింది అంటే, అది దేని ఫలం? జ్ఞాన ఫలం. ఈ పుట్టటాలు, ఈ చావటాలు, ఈ రోదనలు, ఈ వేదనలు, ఆ లోకాలకి తిరగడం, ఈ లోకాలకి తిరగడం, చనిపోయిన తరువాత ప్రయాణాలు చెయ్యటం, అక్కడకి వెళ్ళటం, ఇక్కడకి వెళ్ళటం, అశాంతి, దుఃఖం, ఇవి దేని ఫలం? అజ్ఞాన ఫలం.

సర్వసాధారణంగా సొంత ఆలోచన లేనివాడికి ఆత్మ విశ్వాసం ఉండదు. ఎవడికైతే సొంత ఆలోచన ఉందో, ఎవడికైతే దీర్ఘదృష్టి ఉందో, ఎవడికైతే లోతు ఆలోచన ఉందో, ఎవడైతే స్వతంత్ర్యంగా ఆలోచించుకోగలడో, వాడికి ఆత్మ విశ్వాసం ఉంటుంది. ఎవడికైతే నైతిక విలువలు ఉన్నాయో వాడికి ఆత్మ విశ్వాసం ఉంటుంది. ఆత్మ విశ్వాసం లేనివాడు ఏమీ సాధించలేడు జీవితంలో, ఎవడికైతే వాడి మీద వాడికే విశ్వాసం లేదో, వాడు జీవితంలో ఏమీ సాధించలేడు. ఇహంలో కానీ, పరంలో కానీ ఏమీ సాధించలేడు. ముందు ధైర్యం ఉండాలి. అన్ని మానసిక రోగాలకి మందు ఏమిటి అంటే, ధైర్యం. చాలామంది పిరికితనం వల్లే మానసికంగా disturb అయ్యిపోతూ ఉంటారు. Natural happiness, normal happiness, సముద్రంలో ఎంత నీరు ఉందో మన హృదయంలో అంత సుఖం ఉంది. అంత సుఖం మనకి అనుభవంలోకి రాకపోవడానికి కారణం మన మైండ్ లో ఉన్న disturbance. మన మైండే కారణం. మనం ఏదో ఒక మార్గంలో ప్రయాణం చేస్తున్నాం అనుకోండి. మీ

**మనస్సుని యాతనా శరీరం అంటారు. మీ మనస్సే మిమ్మల్ని యాతనలు పెడుతుంది. మీ ఇంట్లోవాళ్ళు బయటి వాళ్ళు మిమ్మల్ని యాతనలు పెడుతున్నారు అనుకుంటారు. మిమ్మల్ని ఎవరూ యాతనలు పెట్టక్కరలేదు, మీ మనస్సు ఉన్నంతసేపు మిమ్మల్ని యాతనలు పెట్టటం ఆగదు.**



మార్గం కరెక్ట్ కాదని ఎవరైనా చెబితే, అసలు మన సొంత ఆలోచన లేకుండా అది విడిచి పెట్టేస్తాము, ఇంకో మార్గం పట్టుకొంటాము. అదీ కరెక్ట్ కాదని ఇంకొకరు చెబితే దానిని విడిచి పెట్టేస్తాము. ఎందుకు స్వీకరిస్తున్నాడో వాడికే తెలియదు. ఎందుకు వదిలేస్తున్నాడో వాడికే తెలియదు. సొంత ఆలోచన లేని మూలాన కొంతమంది ఇలా మార్గాల్లోకి వెళతారు, మళ్ళీ వదిలేస్తూ ఉంటారు. అన్ని మార్గాలు ఒక్కటే, భక్తి మార్గం, జ్ఞాన మార్గం, కర్మ మార్గం, అన్ని మార్గాలు ఒక్కటే. ప్రపంచంలో ఏ వస్తువు నాది కాదు అనుకోవడం జ్ఞాన మార్గం. ఈ సృష్టి అంతా నాది అనుకోవడం కర్మ మార్గం.

భగవంతుడు కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే నీ కుటుంబం యొక్క స్వార్థం కోసం నువ్వు ఎలా పనిచేస్తున్నావో, అలా సృష్టి కోసం నువ్వు పనిచేస్తే నీకు మోక్షం వస్తుంది అని చెప్పాడు. స్వార్థపరుడు తన కుటుంబానికే పరిమితమై ఎలా పని చేస్తాడో అదే విధంగా సమాజం కోసం, సృష్టి కోసం అలా పనిచేస్తే, నీకు కూడా మోక్షం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంటే దాని వలన ముందు చిత్తశుద్ధి కలుగుతుంది, తరువాత నీకు జ్ఞానం కలిగే అవకాశం ఉంది. సత్యవస్తువును తప్ప అన్నిటినీ నమ్ముతాం. భగవాన్ చెబుతున్నారు మనం నిజాన్ని మటుకు నమ్మం. నిజం కాని దానిని ప్రతీ దానిని నమ్ముతాం. సత్యాన్ని, నిజాన్ని మటుకి నమ్మం. ఏదైతే నిజం కాదో దానిని మనం నమ్ముతూ ఉంటాం. దానికి కారణం ఏమిటి? రూపదృష్టి, నామదృష్టి. మనలో ఉన్న రూపదృష్టి, నామదృష్టి వల్ల మనం నిజం కాని దానిని నమ్ముతాం. రమణమహర్షి గారు ఒక మాట చెప్పారు. నువ్వు నిజం కాని దానిని కూడా నిజం అనుకోవచ్చు. ఎవరు నిన్ను అడ్డు పెట్టరు. కానీ నువ్వు నిజం కాని దానిని నిజం అనుకున్నా అది నిజం కాదు. ఒక అసత్యాన్ని నువ్వు సత్యం అనుకోవచ్చు. అనుకుంటే అనుకో, ఎవరు వచ్చి నిన్ను అడ్డు పెట్టరు. ఒక అసత్యాన్ని నువ్వు సత్యం అనుకోవడం వల్ల అసత్యం సత్యం మటుకి కాదు. జ్ఞానం కాని దానిని నువ్వు జ్ఞానం అనుకోవచ్చు. నువ్వు అనుకున్నావు కాబట్టి అది జ్ఞానం కాదు. ఈ ఊరు ఏమిటి? జిన్నూరు. ఇది పాలకొల్లు అని మనం అనుకోవచ్చు. కానీ మనం అనుకున్నంత మాత్రం చేత ఇది పాలకొల్లు అవ్వదు. దానిని జిన్నూరు అనుకున్నప్పుడు జిన్నూరే, నువ్వు పాలకొల్లు అనుకున్నప్పుడు కూడా అది పాలకొల్లు కాదు, జిన్నూరే. నువ్వు తొంభై అనుకోవచ్చు, కానీ

అసత్యాన్ని నువ్వు సత్యం కింద నమ్మినప్పుడు కూడా అది అసత్యమే. నువ్వు నమ్మావు కాబట్టి అది సత్యం అవ్వదు. ఇది ఇక్కడ భగవాన్ చెప్పే లాజిక్. అందుచేత నిత్యవస్తువుని తప్ప మనం అన్నిటినీ నమ్ముతాం. నిజం కాని ప్రతీ దానిని మనం నమ్ముతాం, కాని నిజాన్ని మనం నమ్మం. నిజాన్ని నమ్మడానికి ఎంతో వివేకం ఉండాలి, ఎంతో ఆ హృదయ లోతుల్లోకి, లోయలలోకి దిగగల శక్తి ఉండాలి. ఎంతో వివేకవంతుడికి కానీ నిజాన్ని నమ్మే శక్తి ఉండదు.

మనం ఏదైతే నేను, నేను అనుకుంటున్నామో ఈ దేహగతమైన నేనుని విడిచి పెడితేనే కానీ మనకి నిజం తెలియదు. దానిని విడిచిపెట్టడానికి మనం ఇష్టంగా లేము. ఎందుచేత? దేహగతమైన నేను మనం అనుకుంటున్నాం కాబట్టి దానిని విడిచి పెట్టడానికి మనకి ఇష్టం లేదు. ఏదైతే నువ్వు నేను, నేను అంటున్నావో, ఈ బాడీ బౌండ్ "I", personal "I", ఈ individual "I", ఈ false "I"ను పోగొట్టుకుంటే నువ్వు పోవయ్యా, నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది అన్నారు. ఇది ఇక్కడ లాజిక్. ఈ నేనును పోగొట్టుకోవడం వల్ల నువ్వు పోవు. నువ్వు ఎవరవో నీకు తెలియబడుతుంది. సత్యవస్తువుని తప్ప మనం అన్నిటినీ నమ్ముతాం. అసత్యమైన నమ్మకాలను అన్నిటినీ వదిలివేయాలి. అది ఇక్కడ భగవాన్ చెప్పేది. అసత్యాన్ని సత్యం అనుకుంటున్నావు నువ్వు. ముందు ఆ భావన విడిచి పెట్టాలి. నిజం కాని దానిని నిజం అనుకుంటున్నాం, ముందు ఆ తలంపుని విడిచి పెట్టాలి. అది విడిచి పెట్టేటప్పుడు మనకు భయం వేయవచ్చు అప్పుడు మనకి ప్రాక్టీస్ కావాలి, ధైర్యం కావాలి, ఆత్మ విశ్వాసం కావాలి.

గట్టిగా గాలి వేస్తే పడిపోకుండా అరటిచెట్లకి ఏదో ఒకటి support పెడతారు, అలాగే మనం మనసుకి ఏవో బోట్లు పెట్టుకుని బ్రతుకుతున్నాం. ఆ బోట్లు ఊడిపోవడం తప్పదు. ఒక్కొక్కసారి రమణమహర్షి గారు ఏమి చేస్తారు? ఆ బోట్లు కదుపుతూ ఉంటారు, అందుచేత ఆయన తోటి చాలామందికి నష్టం. ఆ బోట్లు ఊడిపోతేనే కానీ వీడికి నిజం తెలియదు. ఆ బోట్లని ఆధారంగా పెట్టుకుని ఇదే నిజం అనుకుంటూ ఉంటాడు వాడు. ఆయన ఏమి చేస్తాడు మొత్తానికి బోటు కదిపితే వాడు కంగారు పడతాడు అని ఆ బోటును కొంచెం ఊపుతాడు. ఆ బోటు కదులుతూ ఉంటే వీడికి భయం వేస్తుంది. ఇంక వీడు హృదయం యొక్క లోతుల్లోకి ఏమి దిగుతాడు? మనం మనస్సులో ఏవో ఒకటి ఊహించుకుంటాం. ఊహించి వాటికి support పెట్టుకుంటాం. ఇది నిజం, ఇది నిజం అని.

నిజం కానిదానిని కూడా నిజం నిజం అనుకుంటాం. మనస్సుకి ఏదో బోట్లు పెట్టుకుని బ్రతుకుతాం. గురువు ఏమి చేస్తాడు అంటే టైము చూసి ఆ బోటు ఒకసారి కదుపుతాడు. నువ్వు ఎంతవరకు తట్టుకోగలవు అని, అప్పుడు తట్టుకున్నావా నిన్ను హృదయాంతరాళాల్లోకి తీసుకు వెళ్తాడు, తట్టుకోలేక పోతే వెయిట్ చేస్తూ ఉంటాడు. మానసికంగా నీకు ఉన్న సపోర్ట్ ని ఊడగొడితేనే కానీ ఏది నిజమో నీకు తెలియబడదు. ఆ supportలు బయటకి లాగితేనే కానీ నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడదు. మీరు బాగా అర్థం చేసుకోండి, మీ మైండ్ కి ఉన్న సపోర్ట్, పక్కకి తియ్యలేదు అనుకోండి మీ మైండ్ వెళ్ళి హృదయగుహలో పడదు. ఆ సపోర్ట్ నిజం అని అనుకుంటూ ఉంటుంది.

అసత్యమైన నమ్మకాలను అన్నిటినీ వదిలివేయాలి. నువ్వు అసత్యాన్ని సత్యం అనుకోవటం వల్ల అది సత్యం కాదు. ఆ నమ్మకాన్ని నువ్వు విడిచి పెట్టాలి. మనం చేయవలసింది అది మాత్రమే. నిజం అనేది ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. మనం అనిజాన్ని నిజం అనుకుంటున్నాం. అసత్యాన్ని సత్యం అనుకుంటున్నాం, అది వదిలేస్తే సరిపోతుంది. అప్పుడు సత్యం తనంతట తానే ప్రకాశిస్తుంది. నువ్వు నిజం కానిదానిని నిజం అనుకుంటున్నావు. పోనీ మీకు ఏదైనా అనారోగ్యం ఉంది అనుకోండి, అనారోగ్యాన్ని పోగొట్టుకున్నారు అనుకోండి ఏమి వస్తుంది? ఆరోగ్యం వస్తుంది. నిజం కానిదానిని మీరు నిజం అనుకుంటున్నారు. ఆ నిజం కానిదానిని నిజం అనుకునేది ఒక తలంపు. ఆ తలంపు మనలని పట్టుకుని కొన్ని జన్మలు తీసుకునిపోతుంది. మన తలంపులే మన సంకెళ్ళు. ఇతరులు ఎవరు మనకి సంకెళ్ళు వెయ్యక్కర్లేదు. మన తలంపులే మన సంకెళ్ళు, మన వాసనలే మన సంకెళ్ళు, మన దుఃఖాలే మన సంకెళ్ళు, ఆ సంకెళ్ళు మనకి కనపడవు. మన దుఃఖాలే మనకి సంకెళ్ళు, మన భారాలే మనకి సంకెళ్ళు, అయితే గురువు అనుగ్రహం లేకుండా కేవలం స్వప్రయత్నం వల్ల, కేవలం నీ తెలివి తేటల వల్ల బ్రహ్మానుభవం నువ్వు పొందలేవు. గురువు అనుగ్రహం అవసరం. గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. మనం ఏవో పనులు చేస్తాము, మంచి పనులో, చెడ్డ పనులో చేస్తాం, ఆ పని చేసిన తరువాత మనం ఆ పని యొక్క ఫలాన్ని అనుభవిస్తాం కదా, అనుభవించినపుడు అదే సంస్కారంగా, వాసనగా మన మెదడులోకి వస్తుంది. మన

శరీరం స్మశానంలో కాలిపోయినా, ఆ వాసనలు, సంస్కారాలు మటుకి కాలవు. అవి బహు జన్మలు మన కూడా వస్తూ ఉంటాయి.

కృష్ణుడు గీతలో ఇలా చెప్పాడు, రామకృష్ణ పరమహంస ఇలా చెప్పాడు, రమణాచార్యుడు ఇలా చెప్పాడు, శంకరాచార్యుల వారు ఇలా చెప్పారు. చెప్పినదంతా బాగానే ఉంది. అయితే మనం కూడా సొంతంగా ఆలోచించుకుందాం అని కూర్చుంటాం అనుకోండి ప్రమాదం, మాయ అంతా ఎక్కడ ఉంది అంటే ఆ శంకరాచార్యులు చెప్పిన మాటలని, కృష్ణుడు చెప్పిన మాటలని, మన మనస్సు నమ్మనివ్వదు. ఇది బాగా అర్థం చేసుకోండి, ఎందుకు నమ్మనివ్వదు అంటే, మన పూర్వజన్మల వాసనలు బ్రెయిన్‌లో ఉన్నాయి. మైండ్ ఎక్కడ ఉంది? మెదడులో ఉంది. రమణమహర్షి గారు ఏమన్నారు అంటే నీ తలకాయ, నీ పొట్ట, నీ కాళ్ళు, నీ చేతులు, నీ శరీరం మొత్తం అంతా మైండ్ యొక్క క్రియేషన్. మొత్తం నీ బాడీ అంతా మైండ్ యొక్క క్రియేషన్. మైండ్ మీదకి వచ్చే ప్రతీ వికారం కూడా నీ శరీరం మీద పడిపోతుంది. మైండ్‌లో నీకు ఏదైనా చిన్న వికారం వచ్చింది అనుకో ఆ వికారం నీ శరీరం మీదకి వచ్చేస్తుంది. సైన్సు కూడా మైండ్‌కే పరిమితం అన్నారు రమణమహర్షి. సైన్సు ఎవరు create చేస్తున్నారు? మైండ్ create చేస్తుంది. సైన్సు కూడా దేనికి పరిమితం? మనస్సుకే పరిమితం. నీకు గాఢనిద్రలో సైన్సు గొడవ ఉందా? లేదు. దేవుడు గొడవ ఉందా? లేదు. ప్రపంచం గొడవ ఉందా? లేదు. దేహం గొడవ ఉందా? లేదు. కానీ మీరు ఉన్నారా, లేదా? మీరు ఉన్నారు. మీకు మైండ్ వచ్చినప్పుడే సైన్సు వస్తుంది. మైండ్ వచ్చినప్పుడే దేవుడు వస్తున్నాడు. మైండ్ వచ్చినప్పుడే మీకు దేహం కూడా వస్తుంది. మైండ్ వచ్చినప్పుడే world కూడా వస్తుంది. మైండ్ వచ్చినప్పుడే మీకు చావు కూడా వస్తుంది. మైండ్ వచ్చినప్పుడే మీకు పుట్టుక కూడా వస్తుంది. మీ body కూడా mind యొక్క క్రియేషన్, మెదడు తోటి ఆలోచిస్తాము. కృష్ణుడు చెప్పాడు కదా ఇలా భగవద్గీతలో అని ఆలోచన మొదలు పెడతాము. ఆలోచన మొదలు పెట్టేటప్పటికి పూర్వ సంస్కారాలు, పూర్వ వాసనలు, పూర్వ తలంపులు, ఆ బలీయమైనటు వంటి tendencies మనలో ఉన్నాయి కదా, ఆ వాసనలు ఏమి చేస్తాయి అంటే మిమ్మల్ని కరెక్ట్‌గా ఆలోచన చెయ్యనివ్వవు, అవి అడ్డు వచ్చేస్తాయి. ఆ వాసనలు కేవలం నీ ప్రయత్నం

వల్ల, నీ సాధన వల్ల నువ్వు remove చేసుకోలేవు. గురువు అనుగ్రహం ఉండాలి, ఈశ్వర అనుగ్రహం ఉండాలి. తెలుసుకోవాలి అనే కాంక్ష ఉంది మనకి, భగవదనుభవం పొందాలి అనే కాంక్ష ఉంది, కానీ మనం దానికి సంబంధించిన ప్రయత్నం మొదలు పెట్టేటప్పటికి, దానికి సంబంధించిన ఆలోచన ప్రారంభించేటప్పటికీ, ఇక్కడ నుంచి కారులో పాలకొల్లు వెళుతున్నాం అనుకోండి, ఏదో ఒకటి అడ్డు వస్తుంది అనుకోండి, మన ప్రయాణం సాగుతుందా? సాగదు. అదే విధంగా మనం ఏదైనా ఆలోచన మొదలు పెట్టేటప్పటికీ ఆ పూర్వజన్మ వాసనలు, ఆ పూర్వజన్మ తలంపులు, పూర్వజన్మ సంస్కారాలు వచ్చి, ఈ ఆలోచనని ఆపు చేసేస్తాయి.

అందరి హృదయాలలో చైతన్య రూపంలో, ఆత్మ రూపంలో ఉన్నాను అని కృష్ణుడు చెప్పాడు. నేను ఎక్కడో బయట లేను అని ఆయన కరెక్ట్ అడ్రస్ ఇచ్చాడు. నేను అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను, చైతన్యంగా ఉన్నాను అని చెప్పాడు. అయితే మనం అక్కడ ఎందుకు ములగలేక పోతున్నాం? భగవంతుడు నీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు. కానీ హృదయంలోకి మన మనస్సు వెళుతోందా? వెళ్ళటం లేదు. ఎందుకు? ఈ తలంపులు, ఈ వాసనలు, జన్మాంతర సంస్కారాల యొక్క వేగం మనస్సుని హృదయంలోకి వెళ్ళనివ్వటం లేదు. హృదయం దాకా వెళ్ళక్కర్లేదు, కనీసం మనం సక్రమంగా ఆలోచించ గలగాలి. ఆ జన్మాంతర సంస్కారం, ఆ జన్మాంతర వాసన, సక్రమంగా మనల్ని ఆలోచించ నివ్వదు. వాటి ప్రభావం అంత వేగంగా ఉంది. నిగ్రహః కిం కరిష్యతి వాసనలు వేగంగా ఉన్నప్పుడు, నిగ్రహం మటుకు ఏమి చేస్తుంది అన్నాడు భగవంతుడు. అంటే సంస్కారం వేగం అతి బలీయంగా ఉన్నప్పుడు, ఆ వాసన యొక్క వేగం అతి బలీయంగా ఉన్నప్పుడు గురువు చెప్పినా, దేవుడు చెప్పినప్పటికీ మీ సంస్కారం ఆ నిజాన్ని నమ్మనివ్వదు. ఆ అనాలసిస్ చూడండి, అద్భుతం, అపూర్వం, ఉదాత్తం. ఆ క్లారిటీ చూడండి. భగవంతుడు వచ్చి చెప్పినా ఆ నిజాన్ని నమ్మనివ్వదు. కారణం ఏమిటి? నీ వాసన అంత వేగంగా ఉంది. నీ అలవాట్లు అంత వేగంగా ఉన్నాయి. నీ తలంపుల యొక్క force, నీ habits యొక్క force, అది నిన్ను నమ్మనివ్వదు.

నీ హృదయంలో నిజం లేకపోవటం కాదు, నీ హృదయంలో నిజం అనేది ఒకటి

ఉంది. ఆ నిజం నీకు తెలియక పోవటానికి ఎవరో ఇతరులు కారణం కాదు. నీ వాసనలే కారణం, నీ అలవాట్లే కారణం, నీ తలంపులే కారణం, ఎప్పుడైతే నీకు వాసనా క్షయం అయ్యిందో, ఎప్పుడైతే ప్రకృతి గుణాలను నువ్వు దాటి వెళ్ళిపోయావో, అప్పుడు నువ్వు సత్యాన్ని కనిపెట్టనక్కరలేదు. అదే నీకు వ్యక్తమవుతుంది. నీ హృదయంలో ఉన్న నిజం నీకోసం ఎదురు చూస్తోంది. ఏ అలవాట్లు అయితే, ఏ వాసనలు అయితే, ఏ తలంపులు అయితే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని cover చేస్తున్నాయో, ఆ coverని remove చేస్తే దానిని నువ్వు కనిపెట్టక్కర్లేదు. ఉన్న వస్తువు ఉన్నట్టుగా నీకు వ్యక్తం అవుతుంది. ఇప్పుడు మనస్సు నీకు నేనుగా ఏ విధంగా వ్యక్తం అవుతుందో, నీ హృదయంలో ఉన్న నిజం కూడా, అంత స్పష్టంగా, అంత సూటిగా, అంత సరళంగా, అంత క్లారిటీ తోటి నీకు వ్యక్తం అవుతుంది. కొంతమంది సాధన బాగా చెయ్యాలి అభివృద్ధిలోకి రావాలి అని ప్రారంభిస్తారు, మనం తరించాలి, ప్రార్ధన బాగా చెయ్యాలి, భగవదనుభవం పొందాలి అనుకుంటూ సాధన బాగానే ప్రారంభిస్తారు. సాధన అంటే ఏమి లేదు, ప్రయత్నం. మనం సాధన చెయ్యాలి, అభివృద్ధిలోకి రావాలి అని ఏదో ప్రేరణ ఉంటుంది నీకు, ఆ ప్రేరణ బట్టి నువ్వు ఏమి చేస్తావు? బాగానే ప్రారంభిస్తావు. తరువాత అది మందగించిపోతుంది. మొట్టమొదట్లో నువ్వు ఎంత వేగంగా తలపెట్టావో, చివరి వరకు నీకు ఆ పట్టుదల ఉండదు. ఆ patience ఉండదు. కొంతమంది ప్రారంభించి వదిలేస్తూ ఉంటారు. పని ప్రారంభిస్తారు మళ్ళీ వదిలేస్తూ ఉంటారు.

నువ్వు పని ప్రారంభించి అది చివరి వరకు కొనసాగాలి అంటే దైవానుగ్రహం ఉండాలి. భగవంతుడు ఆ శక్తి ఇస్తే మనం ఆ పని పూర్తి చెయ్యగలం. భగవదనుగ్రహం లేకపోతే మనం ఆ పనిని పూర్తి చెయ్యలేము. ఇక్కడ ఏమంటున్నారు అంటే నువ్వు పని

**మన భక్తి యొక్క మెచ్యూరిటీ ఎలా ఉండాలంటే, భగవంతుడు వచ్చి మీకు మోక్షాన్ని ఇస్తాను అన్నాడు అనుకో, నీ ఇష్టం అనాలి. అంతేకాని ఎప్పుడు ఇస్తావు అని కంగారుపెట్టినట్టుగా ఉండకూడదు.**



ప్రారంభించేటప్పుడు బాగానే ప్రారంభిస్తావు. సాధన చెయ్యాలి, భగవంతుడిని తెలుసుకోవాలి, ఆత్మానుభవాన్ని అందుకోవాలి, ఆత్మ జ్ఞానాన్ని మనం సంపాదించాలి అని పట్టుదలగానే నువ్వు ప్రారంభిస్తావు. కానీ ఏదో ఒక వాసన నీకు అడ్డు వస్తుంది. ఏదో కారణం అడ్డు వస్తుంది. ఆ కారణం అడ్డు వచ్చేటప్పటికి అప్పుడు నీ సాధన మళ్ళీ మందగించిపోతుంది. తరించాలి అనే పట్టుదల వచ్చేది మీ లోపల నుంచే పని ప్రారంభిస్తారు, తరువాత మీ లోపల ఏదో బలహీనత ఉంటుంది. ఆ బలహీనత వచ్చి మీ సాధన యొక్క వేగాన్ని ఆపు చేసేస్తుంది. ఇదీ లోపల నుంచే వస్తుంది, అదీ లోపల నుంచే వస్తుంది. మనం తరించాలి అనే బుద్ధి ఎక్కడ నుంచి వస్తుంది? బయట నుంచి వస్తుందా? లోపల నుంచే వస్తుంది. పని ప్రారంభిస్తున్నాం. మళ్ళీ లోపల సంస్కారాలు ఉంటాయి కదా, కోరికలు ఉంటాయి కదా, ఆ కోరిక interfere అయ్యి నీ సాధన యొక్క వేగాన్ని తగ్గించేస్తూ ఉంటుంది. స్నేహాల్లో తేడా వచ్చినా కానీ తగ్గిపోతుంది. Holy company చాలా ముఖ్యం.

రమణమహర్షి గారికి మంత్రాలు ఇవ్వడం, పుచ్చుకోవడం ఈ గొడవ ఏమీ లేదు ఆయనకి, he is above all these things. ఈ మంత్రాలు ఇవ్వటాలు, ఈ కూర్చోవటాలు, పాద పూజలు ఆయనకు ఏమీ లేవు. ఎవరైనా వచ్చి నాకు ఏదైనా మంత్రం ఇమ్మంటే, నేను ఎవరి దగ్గర అయినా పుచ్చుకున్నానా నీకు మంత్రం ఇవ్వడానికి అనేవారు. నేను ఎవరి దగ్గరైనా మంత్రం పుచ్చుకుంటే మీరు అడిగితే ఇస్తాను, నేను ఎవరి దగ్గర పుచ్చుకోనప్పుడు నీకు ఏమి మంత్రం ఇస్తాను అయ్యా అనేవారు. ఎవరైనా నమస్కారం పెడితే ఎందుకు అయ్యా ఈ శవం ముందు ఆ శవాన్ని అన్నిసార్లు పడేస్తున్నారు అనేవారు. మనం పాదాలకి నమస్కారం పెడతాం, పాదాలు అంటే మూలం. నీ మూలం ఎక్కడో బయట లేదు. నీ మూలం నీ హృదయంలోనే ఉంది. నువ్వు వైరాగ్యం అనే తొడుగు తొడిగి నీ హృదయంలోకి నువ్వు మునుగు. అయితే నీ మనస్సుకి తూకం సరిపోవటం లేదు. తేలిక మనస్సు ఎప్పుడు హృదయంలో దిగలేదు. తేలిక స్వభావం ఉన్నవాళ్ళు మటుకి హృదయంలో దిగలేరు. మీ మనస్సుకి బరువు చాలటం లేదు. మీ మనస్సుకి సమగ్రత చాలటం లేదు. అందుచేత నీ హృదయంలోకి నువ్వు మునగలేక పోతున్నావు. నీ మూలం ఎక్కడో బయట లేదు. నీ మూలం ఎక్కడ ఉంది? నీ హృదయంలోనే ఉంది. నేను అనే తలంపు మీకు ఎక్కడ నుంచో బయట నుంచి రావటం లేదు. మీ లోపల నుంచే వస్తుంది. అది ఎక్కడ

నుంచి వస్తుందో నీకు తెలియదు. ఎక్కడ నుంచి వస్తుందో నీకు తెలిస్తే దేవుడి స్వరూపం కూడా నీకు తెలుస్తుంది. నేను అనే తలంపు అందరికీ ఉంది. నేను అనే తలంపు లేనివాడు ఎవడూ లేడు.

ఒకవేళ మీరు ఎవరినైనా ద్వేషిస్తే, ఎవరినైనా అసహ్యించుకుంటే బయట ఉన్న మనుషులను ద్వేషించకండి, అసహ్యించుకోకండి. మీలో ఉన్న అబద్ధమైన నేనునే, ఆ false "I" నే ద్వేషించండి. మీకు స్వర్గ రాజ్యం రాకుండా అడ్డు వచ్చేది కూడా అదే. మీకు బ్రహ్మానుభవం కలగకుండా అదే అడ్డు వస్తుంది కాబట్టి ఆ నేనును ద్వేషించండి. ఆ నేను లోపల నుంచే వస్తోంది. అది ఏ సోర్స్ లోంచి వస్తుందో మీకు తెలియదు. ఆ నేను అనే తలంపు మీ బాడీ లో ఏ సోర్స్ లోంచి అయితే వస్తోందో, ఆ సోర్స్ ఆధ్యాత్మిక హృదయం, అక్కడే దేవుడు ఉన్నాడు. దేవుడు ఎక్కడో నీకు దూరంలో లేడు. నీ ఇంద్రియాలు కంటే, నీ శరీరం కంటే, నీ సంకల్పాలు కంటే అత్యంత సమీపంలో ఉన్నాడు. ఆ నేను అనే తలంపు సోర్స్ లోనే దేవుడు ఉన్నాడు. అక్కడ దేవుడు ఉన్నాడు కాబట్టే నేను అనే తలంపు నీకు వస్తుంది. అక్కడ చైతన్యం లేకపోతే నేను అనే తలంపు కూడా నీకు రాదు. ఆధ్యాత్మిక హృదయం అంటే ఎక్కడో ఉంది అనుకోకండి. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకోకండి. ఈ నేను అనే తలంపు యొక్క మొదలులోనే, దాని అడుగులోనే, దేవుడు ఉన్నాడు. అక్కడ నుంచే ఈ నేను అనే తలంపు వస్తుంది. ఈ నేను అనే తలంపు సోర్స్ కనుక నీకు వ్యక్తం అయితే నీకు సర్వత్రా ఉన్న వస్తువు కూడా వ్యక్తం అవుతుంది.

ఒక భక్తుడు భగవాన్‌ను "నన్ను ఎవరిని గురువుగా పెట్టుకోమంటారు" అని అడుగుతున్నాడు. దానికి భగవాన్ "ఎవరి సమక్షంలో నీకు శాంతి లభిస్తుందో అట్టి వారినే నీ గురువుగా ఎంపిక చేసుకో, ఎవరి సమక్షంలో కూర్చుంటే నీ దుఃఖం అంతా ఆరిపోతుందో, ఎవరి సమక్షంలో కూర్చుంటే నీ దుఃఖం అంతా పల్చబడిపోతుందో, ఎవరి సమక్షంలో కూర్చుంటే నీ ఇంద్రియాలు అన్నీ చల్లబడతాయో, ఎవరి సమక్షంలో కూర్చున్నప్పుడు నీ హృదయంతరాళల్లోంచి శాంతి పొంగి పొంగి వస్తుందో, అంటే మీ ప్రయత్నం తోటి సంబంధం లేకుండా, ఎవరి presence లో కూర్చుంటే నిన్ను శాంతి వరిస్తుందో, అట్టి వానిని నువ్వు గురువుగా తీసుకో" అన్నారు. కోరికలని నువ్వు satisfy చేసేకొలది వాటి

strength పెరిగిపోతూ ఉంటుంది. కోరికలలో ఉన్న స్వభావం అది. నిప్పులో మనం నెయ్యి వేశాం అనుకోండి నిప్పు ఆరిపోతుందా? పెరిగిపోతుందా? పెరిగిపోతుంది. అలాగే నువ్వు కోరికని satisfy చేస్తూ ఏ కోరికని కూడా నువ్వు తొలగించుకోలేవు. ఒక కోరికని నువ్వు satisfy చేస్తే ఇంకొక కోరిక వస్తుంది. ఆ కోరిక వెళ్లి ఇంకొక కోరికని తీసుకుని వస్తుంది. నీకు వచ్చిన కోరికని అల్లా సంతృప్తి పరచి ఈ కోరికలని నువ్వు జయించలేవు. పైగా వాటిని జయించలేవు సరికదా, ఆ కోరికల strength పెరిగిపోతూ ఉంటుంది.

కోరికని సంతృప్తి పరచి దానిని మనం జయించలేము. అంటే కోరిక నీ హృదయ స్థలంలో ఉన్నంతకాలం అది నిన్నేమి బాధ పెట్టదు. వేడికి అత్యంత సమీపంలో ఉన్నప్పుడు మనకి చలి రాదు. అదే విధంగా చైతన్య హృదయంలో ఉన్నప్పుడు కోరికల సమస్య ఏమి ఉండదు, నీకు కోరిక ఉదయించదు. కోరిక ఉదయించిన తరువాత దానిని కంట్రోల్ చేయటం వేరే విషయం. అసలు నువ్వు కోరిక ఉదయించకుండా చూసుకోవడం మంచిది. కోరిక ఉదయించాక దానిని కంట్రోల్ చెయ్యడం కష్టం. రోగం వచ్చిన తరువాత దానికి మందు వాడడం కంటే రోగం రాకుండా చూసుకోవడం మంచిది. అంటే నీ శిరస్సులో నీ మనస్సు ఎంత naturalగా ఉంటుందో, అంత naturalగా నీ మైండ్ నీ హృదయంలో ఉండగలిగితే అక్కడ ఉండేది దేవుడే కదా, అక్కడ ఉన్నది చైతన్యమే కదా, ఇంక అక్కడ నీకు కోరికే ఉదయించదు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**


**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# బుద్ధుడి నిరహంకార స్థితి

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)



మనం ఎవరి కోసం అయితే ఆలోచిస్తున్నామో, ఎవరి కోసం మన జీవితాన్ని ఖర్చు పెడుతున్నామో, వాడు మనకి ఎదురు తిరిగి, మనల్ని ఏమైనా మాటలు అంటే, ఆపుకోలేని దుఃఖం లోపలనుండి సముద్ర కెరటాలు వచ్చినట్టు వచ్చేస్తూ ఉంటుంది. దానికి కారణం మమకారం. ఈ మమకారం లేనివాడు, ఈ అహంకారం లేనివాడు, స్వార్థం యొక్క స్పర్శ లేనివాడు సృష్టిలో ఎవడైనా ఒకడు ఉన్నాడు అంటే వాడు గౌతమబుద్ధుడు. అహంకారం యొక్క స్పర్శ కాని, మమకారం యొక్క స్పర్శ కాని బుద్ధుడి యొక్క చరిత్రలో ఎక్కడా మీకు కనపడదు.

ఆనంద్ గౌతమబుద్ధుడి సవతి తల్లి కొడుకు. బుద్ధుడు ప్రాణం విడిచి పెట్టే టైము వచ్చింది. ఇక్కడ గౌతమబుద్ధుడు యొక్క హృదయం చూడండి. మీ శరీరం ఎక్కడ దహనం చెయ్యమంటారు అని ఆనంద్ అడిగితే 'ఈ గ్రామంలో అందరి దేహాలు ఏ స్మశానంలో అయితే దహనం చేస్తున్నారో, ఈ దేహాన్ని తీసుకెళ్ళి అక్కడే దహనం చేయండి' అన్నాడు. సమాధి కట్టించమని, దేవాలయం కట్టించమని, పూజలు చేయమని కోరలేదు. వాడు గౌతమబుద్ధుడు!

చివరి క్షణంలో తమ్ముడి దగ్గర సెలవు తీసుకుంటున్నాడు గౌతమబుద్ధుడు. పరిపూర్ణమైనటువంటి శాంతిలో నిండి పోతున్నాడు. అప్పుడు ఆనంద్ "ప్రపంచ చరిత్రలో నీలాంటి మహాత్ముడు, ఈ భూమి మీద పుట్టలేదు. రాముడు, కృష్ణుడు వాళ్ళు చారిత్రక పురుషులు కాదు, వాళ్ళు పౌరాణిక పురుషులు. చరిత్రకి అందినంత లెక్కలో నీలాంటి మహాత్ముడు ఎవడు ఈ భూమి మీద, నడవలేదు" అని చెప్పినప్పుడు "ఆనంద్ పూర్వం

ఋషుల చరిత్రలు, పూర్వం మహర్షుల యొక్క అందరి చరిత్రలు నువ్వు చదివావా? అందరి గురించి నీకు తెలుసా?" అని అడిగాడు. "అందరి గురించి నాకు తెలియదు, చదవలేదు" అన్నాడు ఆనంద్. "నీకు అందరి గురించి తెలియకుండా, అందరి గురించి చదవకుండా, నాకంటే గొప్పవాడు ఎవడు లేదు అని ఎలా చెప్పగలుగుతున్నావు" అని అడిగాడు బుద్ధుడు. ఆ లాజిక్ చూడండి. మనలని ఎవరైనా పొగిడితే మనకి సంతోషం వచ్చేస్తుంది.

"నిజంగా నేను చాలా గొప్పవాడిని అనుకో, నువ్వు అనుకున్నట్టే నాలాంటి మహాత్ముడు ఎవడూ జన్మించలేదు అనుకో మాటవరసకి, నీకు లాభం ఏమిటి? నా అన్నగారు చాలా గొప్పవాడు అని చెప్పుకోవటానికా? ఏదైతే గొప్ప స్థితి అనుకుంటున్నావో ఆ స్థితిని పొందడానికి నువ్వు ప్రయత్నం చేసుకోవడం మానేసి, మా అన్నయ్య చాలా గొప్పవాడు అని చెప్పటం వల్ల నీకు కలిసి వచ్చేది ఏమిటి ఆనంద్? ఈ మాటలు వల్ల ప్రయోజనం ఏమీ లేదు. ఈ మాటల వల్ల నీకు శాంతి రాదు. అందుచేత నువ్వు సాధన చేసుకుని, నీ ఇంద్రియాలని స్వాధీనం చేసుకుని, నిర్వాణ స్థితిని సంపాదించుకో. ఏదైతే గొప్ప స్థితి అనుకుంటున్నావో, ఆ శాంతి స్థితిని సంపాదించుకో. నీ మనసుని అదుపులో పెట్టుకో. నీ అంతట నువ్వు సాధన చేసుకుని ఆ గొప్ప స్థితిని సంపాదించు" అని ఆనంద్‌తో అన్నాడు గౌతమబుద్ధుడు!

మహాత్ములు అందరూ మనకి ఆత్మజ్ఞానం పంచిపెట్టటానికి ఈ భూమి మీదకి వచ్చారు కాని మనం చేసే స్తోత్రాలు పూజల కోసం వాళ్ళు రాలేదు. వాళ్ళలాగా మనల్ని జ్ఞానులు చెయ్యాలి, మనం అందరం సుఖ పడాలి, మనం అందరం శాంతితో, సుఖంతో, సంతోషంతో జీవితాలని గడపాలని మన కోసం వాళ్ళ జీవితాలు అంతా ఖర్చు పెట్టారు. కేవలం మన మీద, ఈ సృష్టి మీద ఉన్న ప్రేమ ఆపుకోలేక, మనకి ఉపకారం చెయ్యకుండా ఉండలేక వాళ్ళు ఏ జ్ఞానస్థితిలో, అద్వైతస్థితిలో ఉన్నారో అక్కడికి మనని తీసుకెళ్లటం కోసం అనేక కోణాల నుంచి సబ్జెక్టు మనకి బోధించారు. అందుచేత, మనము ఆత్మని తెలుసుకోవడానికి నిరంతరం కృషి చేస్తూ, భగవంతుడిని స్మరిస్తూ కాలక్షేపం చెయ్యాలి. మీ బాధ్యతలు జాగ్రత్తగా చూసుకుంటూ, అనవసరమైన గొడవలలో కలుగజేసుకోకుండా ఉన్న కాలాన్ని మీ సాధన కోసం జాగ్రత్తగా ఉపయోగించుకొని సిద్ధి పొందండి. సిద్ధి అంటే జ్ఞానం.



**2025 ఏప్రిల్ 14న భగవాన్ ఆరాధనా దినోత్సవం సందర్భంగా జిన్నూరు రమణక్షేత్రంలో ప్రత్యేక పూజలు**



**2025 మే 2న జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణ**

# సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ

"సత్యం – జ్ఞానం – అనంతం బ్రహ్మ" అన్నది ఉపనిషత్ వాక్యం. పై వాక్యములోని సత్యము, జ్ఞానము, అనంతము, బ్రహ్మ, ఇవన్నీ పర్యాయపదములే. సత్యం అంతటా ఉంది, అనంతముగా ఉంది, కేవలం అది మాత్రమే ఉంది. సత్యము రహస్యముగా ఎక్కడా దాగి లేదు. సత్యము నిత్య సిద్ధము, అదే – నేను. మరి జ్ఞానము అనంతమైనప్పుడు అజ్ఞానం ఎక్కడిది? అజ్ఞానము నిజమైతే అజ్ఞానము చేత జ్ఞానము, జ్ఞానము చేత అజ్ఞానము పరిమితం అవుతాయి, కానీ జ్ఞానము అనంతము చైతన్యానికి మరోపేరు జ్ఞానము. కాబట్టి వాస్తవంగా అజ్ఞానం అంటూ ఏదీ లేదు, వ్యక్తిగత అజ్ఞానం ఉంది. "నా అజ్ఞానం" అని పలుకుతాను. నా అజ్ఞానం నాకు తెలుస్తోంది అంటే, నేను దానిని గుర్తించే ద్రష్టను అవుతాను. కాబట్టి అజ్ఞానాన్ని తన కన్న వేరుగా ఒక దృశ్యంగా చూసే వాని స్వరూపం జ్ఞానమే! మనము వ్యవహారంలో మాట్లాడే జ్ఞానము, అజ్ఞానము ఎవనికి దృశ్యమో వాని స్వరూపం జ్ఞానమే. నా అజ్ఞానం అంటే నేను వేరు నా అజ్ఞానం వేరు. సత్యజ్ఞానమే సర్వుల స్వరూపం. మార్పులేని అఖండ ఆత్మలో మార్పులను చూడడమే అజ్ఞానం. వాస్తవానికి బ్రహ్మము, ఆత్మ, గురువు, నేను, ప్రపంచము, జీవుడు అను పదములు అర్థములో భేదమే లేదు. సృష్టికర్తయగు బ్రహ్మ నుండి, గడ్డిపోచ వరకు ఈ సమస్తమూ ఆత్మయే తప్ప వేరుకాదు. మరి అజ్ఞానం ఎందుకు ఉంది? అది ఉంది అనుకుంటున్నాము కాబట్టి ఉంది. అది భ్రాంతి రూప అజ్ఞానమే. మూల తలంపే అజ్ఞానం, అదే మనస్సు, అదే దీర్ఘ రోగం. ఆత్మ ప్రకాశం నుండి ప్రసారమయ్యే కాంతి కిరణమే మనస్సు. మనస్సుకి యజమాని ఆత్మే. నిర్మల స్వరూప జ్ఞానాన్ని అహంకారం కప్పివేస్తోంది. భ్రాంత దృష్టి వలన త్రాడును పాముగా భ్రమపడినట్లు, అజ్ఞానము వలన తన్ను దేహపరిమితుడిగా భావింపజేస్తోంది. తన ఉనికిని దేహానికే పరిమితం చేయడాన్నే "మిధ్యాజ్ఞానం" అంటారు. ఇట్టి మిధ్యా జ్ఞానాన్ని, సత్య జ్ఞానము చేత అతిక్రమించాలి. అందువల్లే "సత్యజ్ఞానము లేని ఈ జన్మ ఫలమేమి"..... ఓ అరుణాచలా! అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. అహంకారము యొక్క పుట్టుక స్థానాన్ని శోధించి, మనోనాశాన్ని సాధించాలి. అహంకారం (లేదా) మనస్సు ఉన్నంతకాలం ఆత్మ లభ్యం కాదు. దేహం దహనం అయ్యేలోపు, అహంకారాన్ని దహనం చేయాలి. అందుకు చిత్తశుద్ధి, జ్ఞానశుద్ధి, కర్మశుద్ధి ఆవశ్యకములు.

(ఓం తత్ సత్)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**